


# జన్మాంతర స్మృతి



కాశీపురం అనే అగ్రహారంలో ఒక నిరుపేద కుటుంబంలో ఐదు సంవత్సరాల క్రింద పుట్టిన కుర్రవాడి పేరు చంద్రశేఖరుడు. ఈ ఐదు సంవత్సరాలలో జరిగిన విషయాలలో ముఖ్యంగా చెప్పుకో తగినవి చంద్రశేఖరునితండ్రి చనిపోవడం, సంసారతాపత్రయమంతా తల్లి మీద పడటం. ఆ తల్లికూడా వట్టి పిచ్చితల్లి! భర్త చనిపోయాడు కదా! ఇక తన పంచ ప్రాణాలూ ఈ పిల్లవాడి మీదనే నిలిపి, కృష్ణా! రామా అనుకుంటూ కాలాన్ని గడిపి వేద్దా మనుకున్నది.

ఈ కుర్రవాడు కుర్రవాడి గానే వుండిపోయి నట్లయితే అంతా సవ్యంగా జరిగిపోయివుండును. కాని వాడు అలాగ చేయటం మాని వేశాడు. ఒక ఆట ఆడడు! ఒక వస్తువు కావాలని చెప్పడు. చివరికి 'అమ్మా! అన్నమే' అని కూడా నోరారా అడగడు. 'ఇదివరకు బాగానే వుండేవాడుకదా పిల్లడు! ఇప్పుడిల్లాగయిపోయాడేమిటి చెప్మా' అని వాళ్లమ్మకూడా మనసులో అనుకున్నమాట నిజమే. అయితే 'పిల్లవాడు ఎందుకు ఇల్లావున్నాడు? దీని సంగతి యేమిటి' అని ఆమనిషి ఆలోచించనూ లేదు. 'ఇది ఇలా వున్నది. దీనికి మీ అభిప్రాయం యేమిటి?' అని ఇతరులతో సమాలోచనలు జరపనూ లేదు.

ఒకరోజు మధ్యాహ్నం ప్రక్కయింటి ముత్తైదువ గంగాబాయి వచ్చి 'ఏం! నాయనా' అని పలకరిస్తే పిల్లవాడు బెల్లం కొట్టిన రాయిలాగ పలకలేదు. 'ఇదేమిటమ్మా! రాజేశ్వరీ! మీ అబ్బాయి ముంగిలాగా ఈమధ్య మాట్లాడటం మానేశాడూ' అని అనుకుంటూ పోయింది ఆవిడ.

ఆ తరువాత ఇంకో ముసలమ్మవచ్చి వెళ్ళి పోతూ వెళ్ళిపోతూ బిళ్లకుడుంలాంటి రూపాయి చేతిలో పెడితే 'కస్సు' మంటూ లేచి దాన్ని విసిరికొట్టాడు. 'అబ్బో! ఈ కుర్రవాడికి తగనిగర్వం! ఏం చూచుకొనమ్మా' అని సణుక్కున్నది ముసలావిడ.

ఇంకెవరో ఆడమనిషి ఊరికే చూసి పోదామని ఇంటికి వచ్చి, ఎర్రగా బొద్దుగా వున్న చంద్రశేఖరుణ్ణి చూసి ఎంతో ముచ్చటపడింది. పడి వూరుకున్నదీ! ముద్దు పట్టలేక ఒళ్ళోకి తీసుకుని 'నీ పేరేమిటి నాయనా!' అని యెంతో ఆప్యాయంగా అడిగింది. ఏదో పరధ్యానంలో వుండిపోయిన కుర్రవాడు 'రామచంద్ర' అని అన్నాడు. ఇదేమిటి? నిక్షేపంలాంటిపేరు చంద్రశేఖరుడని వుండగా 'ఏదోరామచంద్ర'అంటాడు అని తల్లి లోపల లోపల అనుకుని 'ఎందుకబ్బాయి! అబద్ధాలు! నిజం పేరు చెప్పు నాయనా!'అని చెక్కుసిగా కసిరింది.

అయితే మటుకు-ఆ అబ్బాయికి, అంత చిన్న అబ్బాయికి అంతకోపం రావాలా? ఒక్కమాటుగా పళ్లన్నీ బిగించేశెయ్యాలా? మొగమంతా కంద గడ్డలాగ చేసుకోవాలా? ఈ పనులన్నీ చెయ్యా

సూరత్తు బ్రహ్మానందరావు

మని ఎవరు చెప్పారు? పైగా అంటాడూ 'నా పేరు రామచంద్రే! ముమ్మాటికీ రామచంద్రే! చంద్రశేఖరుడు కానే కాడు' అని. ఆడవాళ్ళిద్దరూ ఒకళ్ల మొహాలు ఒకళ్లు చూచుకున్నారు. ఆ యింటికి వచ్చినావిడ నెమ్మదిగా తేరుకుని మళ్లీ అడిగింది 'అయితే నీ వూరేది బాబూ?' అని.

'రామనగరం'

ఇప్పుడు ఈ పేద సంసారం వుంటూవున్న కాశీపురం యెక్కడ? రామనగరం యెక్కడ? ఈ పర్యాయం వాళ్లమ్మ నిజంగానే భయపడింది. 'ఇదేదో గాలి సంబంధం లాగా వున్నది' అని పాపం చాలా మథనపడ్డది. 'రామనగరంలో ఉన్న యే దెయ్యమో నా పిచ్చికండిని పూనింది కామాల్ను' అని గుండె పగులగొట్టుకున్నంత పని చేసింది. ఆ పళాన్న వూరుకున్నదా? ఇంత బూడిద తెచ్చిపూసింది. ఇంత ఉప్పు దిష్టి తీసి పోసింది. 'మా అబ్బాయి పదికాలాలపాటు బ్రతికి బట్టకడితే, గ్రామదేవతకు పేటపోతు బలి యిస్తాన'న్నది.

ఇద్దరు భూతవైద్యుల్ని రప్పించింది. వాళ్లు వచ్చి, 'ఇది తప్పక గాలి సంబంధమే'నని చిటికెలో తేల్చివేశారు. ఇక భస్మాలేమిటి, భూత వైద్యాలేమిటి - ఇవన్నీ ఆ పిచ్చితల్లి స్వయంగా దగ్గర వుండి చేయించింది. ఇవన్నీ అయ్యాక భూతవైద్యులు ఆమెతో 'ఇక తగ్గిపోతుందమ్మా! ఏ మాత్రం భయం లేదు' అని అనే వరకూ కూడా ఆవిడ మనస్సు శాంతించలేదు.

తరువాత కొన్నిరోజులకు ఈ కుర్రవాడు ఏం చేశాడంటే - నిజంగా ఒక విచిత్ర కార్యమే చేశాడు. ఒక ముసలమ్మ దగ్గరకు పోయి చక్కగా ఆమె ప్రక్కనే కూర్చున్నాడు. ఆవిడ చాలా ఆశ్చర్యపడింది. 'ఎప్పుడూ లేనిది ఇదేమిటి?' అనుకున్నది. అయితే, ఆవిడ కుర్రవాడిని చూసి చాలా ముచ్చటపడిన మాటకూడా నిజమే! లేకపోతే ఆపిల్లవాడి తల అలా నిమరడమెందుకు? 'ఏం నాయనా!' అని అంత ప్రేమతో అడగడమూ యెందుకు! ఇద్దరూ మాటలలో పడ్డారు. ఆలాగ పడక పోయినా బాగా వుండును అని తరవాత కాశీపురంలో అనుకున్నారు కూడా.

మాటల సందర్భంలో కుర్రవాడు ఆ ముసలమ్మని 'రామనగరం, రామనగరం అంటారు. అదెక్కడ అవ్వా?' అని అడిగాడు. ఆముసలమ్మ గొంతుక సవరించుకుంటూ అన్నదీ, 'ఇక్కడే నాయనా! అట్టే దూరం లేదు. 30 మైళ్లే' అన్నది. పిల్లవాడు మెల్లిగా లాలించి, బెల్లించి రామనగరం గురించి చాలా సంగతులు కనుక్కున్నాడు. ఇదంతా యెందుకు చేస్తున్నాడో యెవ్వరికీ చెప్పడుకదా! తన మనస్సులో యేం మెదులుతుందో అసలు పొక్కనే పొక్కడు.

సరాసరి ఇంటికి వచ్చాడు. 'అమ్మా! నాకొక రూపాయి యివ్వవూ?' అని అంటూనే ఇంట్లో అడుగు పెట్టాడు. 'అమ్మా!' అని యెన్నినాళ్లకు పిలిచాడు. బాబు! మా పిచ్చిబాబు" అని ఆ తల్లి వూరికే పొంగిపోయిందే కాని... ఈ కసుగాయన రూపాయి యెందుకూ అని ఆలోచించనూ లేదు. 'ఏమి నాయనా! రూపాయి నీకెందుకు? రూపాయి యిస్తే ఏంచేస్తావు? ఏమన్నా ఆటవస్తువులు కొనుక్కుంటావా?' అని తరచి అడగనూ లేదు. చిట్టినాన్న' అడగటమే అబ్బురం' అని అనుకుని ఒక రూపాయిబిళ్ళ వుంటే అబ్బాయి చేతులో పెట్టింది. అబ్బాయి మళ్లీ మనలో పడుతూ వున్నాడు కదా అని సంతోషపడ్డది.

కాని... మరునాడు మధ్యాహ్నం కుర్రవాడు కన్పించలేదు. వాళ్లమ్మ ఊరంతా వెదికింది. కనబడ్డ ప్రతీవాళ్ళనీ పేరుపేరునా పిలిచి 'మా చంద్రం మీకు కన్పించాడా? మీకు కన్పించాడా?' అని తరచి తరచి అడిగింది. బంగారంలాంటి పిల్లవాడు యెక్కడకు వెళ్లాడో ఎవ్వరికీ తెలీలేదు.

* * *

రామనగరానికి సాయంత్రం నాలుగ్గంటలకు వచ్చిన రైలుబండీలో ఒంటరి ప్రయాణం చేసి దిగిన ఏడేళ్ళ కుర్రవాడు ఒక్కడే. ఆ కుర్రవాడు స్టేషను బయటకు వచ్చికూడా "ఇది క్రొత్తప్రదేశం. ఇక్కడ ఇతర్ల సాయం ఉంటేనే కాని ఒకనిమిషం జరగదు" అని అనుకున్నట్టు లేదు. ఎందుచేతనంటే ఆ పిల్లవాడు ఒక బండీని కాని, ఒక రిక్షానిగాని 'ఫలానాచోటికి కడతావా? ఎంత పుచ్చుకుంటావు?' అని అడగనూ లేదు. కాక

పోగా పెద్దమనుషుల్ని 'ఫలానా వాళ్లిల్లెక్కడ ! ఇక్కడికి ఎంత దూరం ?' అని కూడా ప్రశ్న వెయ్యలేదు. ఆ స్టేషనుకు దగ్గరలోనే వున్న ఒక యింటికి ఆ పిల్లవాడు సరాసరి దారి తీశాడు!

ఆ యింటిలో కమల అనే పాతిక సంవత్సరాల విధవ కాపురం వుంటున్నదన్న సంగతి ఈ కుర్రవాడికి తెలుసా ? సరాసరి ఆ యింటి వైపు ఆ పిల్లవాడు దారితీశాడు. సరిగ్గా ఇదే సమయానికి ఈ కమల అన్న ఆవిడ ఏదో అల్లిక పనిలో నిమగ్నురాలయి ఉంది. ఈ కుర్రవాడేం చేశాడూ ! సరాసరి బయటిగేటు దాటి, లోపల వున్న ఉద్యానవనం దాటి, వసారా మెట్లు కూడా అన్నీ యే భయమూ లేకుండా యెక్కి, నెమ్మదిగా పోయి, ఆ కమల అన్న ఆవిడ ప్రక్కనే నుంచున్నాడు. ఆవిడ తలయెత్తి చూసేసరికి ప్రక్కన యెవ్వరో క్రొత్త కుర్రవాడు. 'ఎ ర్ర గా బు ర్ర గా వు న్నా డు. ఈ కుర్రవాడు మాడడానికి యెంతో ముద్దు వస్తున్నాడు సుమా !' అని అనుకున్నది ఆవిడ. అల్లాగ అనుకుని పైకి ఆ కుర్రవాడితో 'ఎవరబ్బాయివమ్మా నువ్వు ?' అని అడిగింది. ఈ పిల్లవాడు పలకలేదు. ఉలకలేదు. అక్కడే సిగ్గుపడుతూ నిలుచున్నాడు.

'ఎందుకొచ్చావమ్మా ?' అన్నది ఆవిడ.

కుర్రవాడికి యేం చెప్పాలో తోచినట్లు లేదు. 'ఊరికేనే' అన్నాడు.

ఆవిడ కొంచెం ఆశ్చర్యపడింది. తను ఇన్నాళ్లు ఇంతమంది కుర్రవాళ్ళని మాసింది. కాని ఇంత మెత్తగా వుండి ఇంత యిదిగా సిగ్గుపడుతున్న కుర్రవాణ్ణి మాడలేదు.

నీ పేరేమిటి నాయనా ?' అని ఆవిడ అడిగిందే తడవుగా ఆ పిల్లవాడు 'నా పేరు రామచంద్ర' అని ఒక్క విరిచి చెప్పి ఆవిడకేసి దీక్షగా చూడటం మొదలుపెట్టాడు. కాని కమల చప్పున తల వంచేసుకున్నది. తలవంచుకుని పూర్వ వృత్తాంతాల నన్నింటినీ ఒక్కసారి జ్ఞప్తికి తెచ్చుకుంది. పది సంవత్సరాల క్రితం జరిగిపోయిన కొన్ని మధుర వృత్తాంతాలు ఆమె బుర్రలో గిర్రున తిరిగిపోయినవి. అవును ! ఆమె భర్త పేరు కూడా రామచంద్రే. అతడు బ్రతికినంతకాలమూ తనను యెంత ప్రేమతో చూశాడు ! ఒక్క సంవత్సరం కూడా తిరగకుండానే చనిపోయాడు. తనను విగత భర్తృకను చేసి- ఈ ఒంటరి జీవితానికి వొదిలిపెట్టి.

ఒక్క అరగంట గడిచాక ఆమె తిరిగి తలయెత్తడమేమిటి ! ఆ కుర్రవాడు అక్కడే కదలకుండా మెదలకుండా నిల్చుని వుండడము చూసి ఆవిడ ఆశ్చర్యపడిపోవడ మేమిటి... రెండూ ఒక్కసారే జరిగినవి.

'అయ్యో ! నాయనా ! ఇంతసేపూ ఇల్లా నిలుచునే వున్నావా ?' అని ఆవిడా చాలా తపనపడి ఆ కుర్రవానిని తన ప్రక్కనే కూర్చుండ పెట్టుకుని దగ్గరకు తీసుకుని అదీ యిదీ అడగటం మొదలు పెట్టింది.

'నీవెవరబ్బాయివి నాన్నా ?'

పిల్లవాడు మాట్లాడలేదు. ఈ సంగతులతో తనకేమీ నిమిత్తం లేనట్లు ఆమెకేసి చూశాడు.

'అయ్యో నాయనా ! తప్పిపోయినావా ఏమిటి, దారి తెలీక. అసలీ వూరేనా మీది?' అని కమల అడిగింది.

అబ్బే, జవాబు చెప్పడు కదా! బెల్లంకొట్టిన రాయిలాగ అల్లానే వున్నాడు.

'పాపం పిల్లవాడు చాలా జడిసిపోయినట్లున్నాడు.' అని అనుకుని 'పోనీ నాయనా! ఇక్కడే వుండిపోతావా? నేను నీ కన్నీ యిస్తాను' అన్నది కమల.

'ఊఁ' అని తలవూపి తన సంబరాన్ని మొహంలోనే పిల్లవాడు చూపించటం కమలకు తరువాత చాలా రోజుల వరకూ జ్ఞాపకం వున్నది.

'మీ అమ్మా, నాన్నల పేర్లు నీకు జ్ఞాపకం వున్నవా ?' అని అడిగింది ఆవిడ. ఈ సారి కుర్రవాడు మొహం అటు త్రిప్పుకున్నాడు.

ఇహ ఈ కుర్రవానితో యేం చెయ్యాలో ఆవిడకు తోచలేదు. తనకూ యెవ్వరూ లేరు. ఒకపిల్లవాడు అచ్చట ముచ్చటగా తన యింట్లో తిరుగుతూ వున్నాడూ అంటే తనకుకూడా యెంత కన్నుల పండుగగా వుంటుందీ? అని అనుకున్నది. ఆర్చటానికీ, తీర్చటానికీ ఒక పిల్లవాడు వుంటే ఈ జీవితం యెంత తేలికగా గడిచిపోతుంది!

'ఈ ముద్దొచ్చే కుర్రవాడు తనతో వుంటేనేం?' అనుకున్నది.

ఇంకా ఒక్కరోజు కాకుండానే కుర్రవాడు ఆవిడకి అంత ఆప్తమిత్రుడయిపోయాడు. కాశీపురంలో మన్నుతిన్న పాములాగా వున్న కుర్రాడు క్షణంలో ఇంత చలాకీగా అయిపోయాడూ అంటే చెప్పిన యెవరూ నమ్మరు. ఆ రోజున అతడు ఆడిన ఆటలే ఆటలు! పాడిన పాటలే పాటలు!

ఆరోజు కమల నవ్వినట్లు మరి యెప్పుడూ కూడా ఆవిడ నవ్వలేదు. అసలు ఆవిడ కొంగు విడచి పిల్లవాడు అవతలకు వెడితేనా? ప్రొద్దున్న లేచి యింత కాఫీ ఫలహారం చేశారో లేదో అంతే, మళ్ళీ భోజనానికి వంటమనిషి కేక వేసే వరకూ కూడా వాళ్లు మన ప్రపంచంలో వుంటేనా! ఒకటే నవ్వులు! ఒకటే కేరింతలు. 'ఇదేమి చోద్యమమ్మా! ఇంత మైమరుపా!' అనుకున్నది ఆ వంటమనిషి కూడా.

కుర్రవాడు మహా చెడ్డవాడు. ఎంత ఆటలయితేమటుకు పెద్దా, పిన్నా అని కాస్త గౌరవమంటూ వుండొద్దూ! లేకపోతే పీడు ప్రేలెడు లేడు! ఆవిడను ఊరికే 'కమలా! కమలా!' అని పిలుస్తాడేమిటి! అప్పటికీ ఆవిడ రెండు మూడు సార్లు చెప్పింది, 'నాయనా! నన్ను నువ్వు అల్లాగ పేరుపెట్టి పిలవకూడదూ! 'అమ్మా' అని పిలువూ!' అని కాని వాడువింటేనా? ఒక నవ్వు నవ్వి ఆవిడ మాటని తృణీకరించాడే కాని ఆవిడను అమ్మా అని పిలవనే లేదు.

ఆరోజు సాయంత్రం యెవరో ఒకయువకుడు ఆ యింటికివచ్చాడు. వచ్చి సరాసరి చెప్పులతో టకటకమని శబ్దం చేసుకుంటూ లోపలికిపోయి 'కమలా! కమలా!' అని పిలవటం రామచంద్ర కేమాత్రం నచ్చలేదు. కమల యిదంతా చూసికూడా ముఖం ముడుచుకోకుండా వుండటం అంతకన్నా వెగటుగా కన్పించింది ఆ పిల్లవాడికి.

ముగ్గురూ ఒకే బల్లదగ్గర కూర్చుని 'టీ' త్రాగుతున్నప్పుడు ఆ యువకుడు రామచంద్రను చూసి చాలా ముచ్చటపడ్డాడు. 'వూళ్లో సినిమాలు వున్నవి. నాతో వస్తావా?' అని అడిగాడు. కానీ పిల్లవాడికి యువకుడంటే, యెంతమాత్రం గిట్టటంలేదు. ఎందుచేతనంటే ఆ యువకుని ప్రవర్తన అక్కడ యేమాత్రం బాగుండలేదు. అతడు అసలు పెద్దమనిషి తరహాగానే వుండటంలేదు. ఆ పకపకలూ, ఆ వికవికలూ కుర్రవాడి కేమాత్రం నచ్చలేదు. వాళ్ళిద్దరూ ఏవేవో నవ్వుకుంటూ, మాట్లాడుకుంటున్నా కూడా అబ్బాయి వాళ్ళ సంభాషణలో పాల్గొనకుండా బొత్తిగా మూకీభావం వహించాడు.

ఇంతలో కమలకు యింట్లో పనివుండి 'ఇప్పుడే వస్తాను' అనిలోపలికి వెళ్లింది. యువకుడూరుకోలేక రామచంద్రతో సరదాగా మాట్లాడబోయాడు. కాని కుర్రవాడు మాట్లాడదలుచుకున్నట్టు లేదు. యువకుడు నిరుత్సాహపడదలుచుకోలేదు.

'నీవు మా యింటికి వస్తావా? నీకు మంచి మంచి ఫలహారాలు పెడతాను' అని అడిగాడు. కాని కుర్రవాడు మాట్లాడడు.

యువకుడు మళ్లీ అందుకున్నాడు 'నీవెందుకు మాట్లాడవు?' అని.

కుర్రవాడు మాట్లాడకుండా అటు తిరిగాడు. దీనితో యువకుడుకూడా 'పోనీ నాకెందుకులే' అని ఊరుకుని వున్నట్లయితే యెంతో బాగుండేది. కాని యువకుడల్లా చేయకుండా పైగా అన్నాడూ, 'నీవు నాతో సరదాగా ఉండకపోతే యెల్లా బాబూ! ముందుముందు మనం ముగ్గురం కలిసివుండాలి కదా!' అని.

కుర్రవాడు 'ఆ!' అని నోరు తెరచి చాలా ఆశ్చర్యపోయాడు. పైగా నేను నీతో యెందుకుండాలి?' అని మొహం చిట్లించుకుని చురచుర చూశాడు.

'నేనూ కమల పెళ్లి చేసుకుంటున్నాం కదా' అని యువకుడి జవాబు. కుర్రవాడు ఈమారూరుకోలేదు. 'పెళ్ళి! ఆమె వితంతువు కదా!' అని చాలా ఆశ్చర్యపడ్డాడు. యువకుడు తిరిగి అడ్డు ప్రశ్న వేశాడు. 'వితంతువు! ఈ సంగతి నీకెల్లా తెలుసు?' పిల్లవాడు కొంచెంతడబడ్డాడు. ఈ కుర్రవాడు ఈ సమయంలో ఇల్లా యెందుకు తడబడి వాడో కాశీపురవాసులకు - రామనగరం ప్రజలకు చాలా రోజులు తరువాతగాని అర్థం కాలేదు.

'ఆమె చెప్పిందా?' అని ఆ యువకుడు తిరిగి అనేవరకూ కూడా అతడు తేరుకోలేదు. ఇదే సమయం అనుకుని 'ఆ!'అని ఊరుకుండిపోయాడు



రామచంద్ర. ఇంతలో కమల తిరిగి వచ్చింది. తను ఒక్క రెండునిమిషాలు ముందు వచ్చివుంటే ఏమయి వుండేదో అని కమల తరువాత చాలా రోజులవరకూ తన మిత్రులతో అన్నది అని విన్నవాళ్లు చెబుతూవున్నారు.

ఆ యువకుడు నవ్వుతూ, 'ఇదిగో! చూడు కమలా! నీ మిత్రుడు అచ్చం పెద్దవాళ్లు మాట్లాడినట్లు మాట్లాడుతాడు సుమా!' అని అన్నాడో లేదో ఆవిడకూడా అతని నవ్వుకు తాళం కలుపుతూ వెంటనే అన్నదీ, 'అవును! చాలా తెలివైనవాడు సుమా!' అని. ఇల్లా అంటూనే వాళ్లిద్దరూ తెగనవ్వుకున్నారు. ఆ యువకుడు ఆమెను 'కమలా!' అని పిలవడం రామచంద్రకు ఏమాత్రం యిష్టంవున్నట్లు కన్పించలేదు. వాళ్లిద్దరూ పకపకా నవ్వుకునే విధంలోకూడా యేదో వైచిత్రి ఆ కుర్రవానికి కన్పించింది. లేకపోతే మొహాన్ని పక్కకు త్రిప్పుకోవడ మెందుకు? ఎటూకాని భావాలు అందులో ప్రసరింప జేసుకోవడ మెందుకు? దానితో ఊరుకున్నాడా యేమిటి? మనస్సులో యే భావాలు మెదులుతున్నాయో యేమో కాని పాపం మొహాన్ని ఒక విధంగా వికృతంగా పెట్టేశాడు. అది కమల చూసేసింది. 'అయ్యో! నాబాధ ఈవిడ చూసేసిందే' అని తపనపడ్డాడు గామాల్ను, ఆపుకోలేక గుడ్లనీరు పెట్టేశాడు!

అప్పుడు కమల చాలా జాలిపడి వెంటనే అనుకున్నదీ 'పాపం! ఈకుర్రవాడు యేదో చెప్పరాని బాధపడుతున్నాడు సుమా! ఒకవేళ తన అమ్మా నాన్నల గురించి బెంగపెట్టుకున్నాడో యేమిటో మా చిట్టినాన్న' అని తరువాత ఆ అబ్బాయిని అడిగింది 'ఏం! నాయనా! బెంగ పెట్టుకున్నావా? పోనీ మీఅమ్మ నాన్నలదగ్గరకు పంపించెయ్యమంటావా?' అని. రామచంద్ర లోపలవుండే దుఃఖాన్ని దిగమ్రింగుతూ తలకాయ అడ్డంగా త్రిప్పేసి నవ్వడానికి ప్రయత్నం చేశాడు కాని అదియేమంత రక్తికట్టలేదు.

'పోనీ! అల్లా గాలిలో షికారు వెళ్లివస్తావా యేమిటి నాన్నా! నౌఖరునిచ్చి పంపుతాను' అని ఆవిడ అన్నదికానీ రామచంద్రకు అది యేమంత సుఖమయిన వ్యవహారంలాగా కన్పించలేక పోవడంచేత అతడు అల్లా వూరుకుండిపోయాడు. ఇక్కడ వుండటమూ, బయటకు షికారు వెళ్ళటమూకూడా ఆ పిల్లవాడికి ఒక దుర్ఘటకార్యంలాగానే కన్పించింది.

కాని ఆ కమల ఈ సంగతులన్నీ గమనిస్తేగా! నౌఖరును తోడిచ్చి కుర్రవాణ్ణి బయటకు షికారుగా పంపించింది.

కాని రామచంద్ర యెక్కువదూరం పోదల్చుకున్నట్లు లేదు. 'సినిమా హాలుదాకా వస్తారా అబ్బాయిగారూ?' అని అడిగితే, వుత్సాహం చూపించడు. 'అదేమిటి? ఆ మేడ యెవరిది?' అని కుతూహలం చూపించడు కాస్తదూరం పోగానే ఊరుకున్నవాడు ఊరకోకుండా 'ఇంటికిపోదాం! ఇంటికి పోదాం!' అని హరాము చేయటము మొదలు పెట్టాడు. ఈ వ్యవహారం అంతా చూడగా చూడగా నౌఖరికి విసుగెత్తింది. 'ఇదేమిటి! ఈ కుర్రవాడు నిక్షేపంగా అదీ, యిదీ చూసి ఆడుకోక, అస్తమానం ఇంటికి పోదాం! ఇంటికి పోదాం! అని గోలచేస్తాడూ!' అని అనుకుని 'సరే! పోదాంలే! ఊరికే అఘాయిత్యం చేస్తున్నావు!' అని రెండు కసుర్లు కసిరి 'ఇక తప్పదురా' అని అనుకుంటూ వెనక్కి తిరిగాడు. వీడింత తొందరగా వెనక్కి తిరిగి వుండకపోతే ఈ ఘోరమయిన విషయం జరగకుండా వుండేదేమో! అని కమల తరువాత చాలా రోజుల వరకూ విచారించింది. ఆ కుర్రవాడిని ఇంటి గేటుదగ్గర దిగబెట్టి, లోపలికి పొమ్మని చెప్పి తను దగ్గరవుండే ఖిల్లీ దుకాణందగ్గర బాతాఖానీ కొట్టడానికి పోయాడు నౌఖరు. 'గేటుదగ్గర వుండకుండా ఇల్లా యెందుకు చేశావూ?' అని కమల అకణ్ణితరువాత చాలాచివాట్లు వేసిందట!

నెమ్మది నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ రామచంద్ర యింటిలోపలకి వచ్చేసరికి వసారాలో యెవ్వరూ లేరు. హాలులో దీపం వెలుగుతూ వున్నది. తలుపులు ఓరగా మూసివున్నవి. పిల్లవాడు తలుపు ఒకటి లోపలికి త్రోసి చూసేసరికి అతని హృదయం బ్రద్దలయినంత పని అయింది. ఎందుచేతనంటే లోపల కమల ఆ యువకుని ఒళ్లో కూర్చుని ఆ కబురూ ఈ కబురూ యెంతో ఆప్యాయంగా చెబుతూ వున్నది.

చూసిన పుర్రవాడు నెమ్మదిగా వెనకకు తిరిగి, తలుపుమూసి గప్, చిప్ మని ఊరుకున్నట్లయితే పరిస్థితులంత తారుమారయ్యేవి కావు. కాని ఈ పిల్లవాడు యేం చేశాడంటే, ఒక్క పొలికేక వేసి లోపలికి పరుగెత్తాడు. పరుగెత్తినవాడు ఊరుకున్నాడా? ఆ యువకుని మీదపడి, పెద్ద పెద్ద కేకలువేస్తూ నాలుగు దెబ్బలు చెంపమీదా, తలమీదా కొట్టి అతడి మొహమంతా రక్కేశాడు.

వాళ్ళిద్దరూ చాలా ఆశ్చర్యపోయారు. ఆ యువకుడన్నాడు కదా, 'ఇదేమిటి? ఈ పుర్రవాడి కిదేమయినా పిచ్చా?' అని. అల్లాగ అంటూనే ఆ యువతి కేసి చూసి, ఒక్క చిరునవ్వు నవ్వాడు. 'అవును! ఇదేదో పిచ్చిలాగానే వున్నది' అని ఆవిడ కూడా ఒక్క చిరునవ్వు నవ్వింది. అతను మళ్ళీ నవ్వాడు. ఇద్దరూ తెగ నవ్వుకున్నారు పిచ్చివాళ్ళ మాదిరి.

ఈసారి నవ్వులకు పిల్లవాడు చాలా సిగ్గుపడిపోయాడు. ఆ పుర్రవాడు ఇక అక్కడ నిలబడలేక సరాసరి గదిబయటికి వచ్చేశాడు. ఇంకా వాళ్ళ నవ్వులు అతడికి వినిపిస్తూనే వున్నవి 'ఛీ! ఇదేమి రోష్టు?' అని అనుకున్నాడో యేమిటో, అక్కడక్కడ ఆగలేదు గేటు దాటి ఇంటిబయటకు వచ్చాడు. రోడ్డుమీదకు వచ్చేవరకూ కూడా ఆ యువకుని నవ్వు అతని చెవులకు నెమ్మదిగా వినిపిస్తూనే వున్నది.

ఇక పుర్రవాడు పరిగెత్తడం మొదలుపెట్టాడు. ఆ రాత్రివేళ. ఈసారి యెక్కడకు? రైలుస్టేషనుకేసి కాదు- రైలుపట్టాలకేసి!

# సనాతన ధర్మం

అవసరాల రామకృష్ణారావు

“ఇరవైమూడో ఏడు కూడా దాటిపోతున్నది; వానూ ఎన్నాళ్లీ యీ బ్రహ్మచర్యం? వచ్చిన సంబంధమల్లా వెళ్లగొట్టేస్తున్నావు. నీ పెళ్ళి చూస్తేగాని యీ ముసలి ప్రాణం పోదు- ఏదో సంబంధం అంగీకరించు నాయనా?”

“చాల్లేవే అమ్మా, అనుభవించినా నీకింకా అనుభవం రాలేదు; ఇద్దరూ కోడళ్లూ యింట్లో పెట్టిన అల్లరీ, చేసిన ఎడబాటులూ అన్నీ నిముషంలో మరచిపోతావు. ఆడది అత్తారింటికి రాగానే ఏదో అధికారం తెచ్చుకున్నాననుకుంటుంది కాబోలు.”

“తప్పు. అందరి ఆడాళ్ళనీ అలా అనకు నాయనా! నాఖర్మంకాలి, నాకిలాంటి కోడళ్ళు సంభవించారు గాని. లోకమంతా అలాగే ఉంటుందా? వాళ్ళ జానకి చూడు- అత్తామామలకి ఎంత అణుకువగా ఉంటోందో?- పెళ్లాం ఎలాంటిదయినా అదుపాజ్ఞలలో పెట్టుకోకపోవడం మొగాడి తప్పుగాని, రాగానే నమస్కారంచేసి నెత్తిమీద కెక్కించి, దిగమంటే మాత్రం అది దిగుతుందా?”

“నీమోనమ్మా, అందరూ ముందు అలాగే అనుకుంటారు. తీరా ఆ సౌందర్యం, ఆ మాటలు, ఆ నటనా చూసి తెలియకుండా తల్లినే గాదు ప్రపంచాన్నే మరచిపోతారు. నువ్వే చెప్పు, కోడలు వస్తే నాకూ నీకూ యీ చనువూ, స్వాతంత్ర్యం ఉంటుందా?”

“చేతకాకపోతే సరి.”

“ఇందులో చాతగానిదేముందమ్మా, చిన్నన్నయ్య పెళ్ళిదాకా ఏమన్నాడు?” అమ్మా! యిదిగో నీ కోడలు, నీకంటే చక్కటి శిక్షణా, ప్రేమా ఎవరూ యివ్వలేరు-” అని నీ కప్పజెప్పడా? ఆఖరికి భార్య మాటలు విని మొహమొహాలు చూచుకోకుండా యింటిపట్టున వుండకుండా తను నీకు దూరమయ్యేడా లేదా?”

“అదేనోయ్ నాయనా నేనూ అనేది. ప్రతి వ్యక్తికి ఓవ్యక్తిత్వం, స్వాతంత్రం అంటూ